## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం, మార్చి 11 : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గన్నరపు రమేశ్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని సంఘం జిల్లా 4వ మహాసభలను నిర్వహించారు. ముందుగా నేతాజీ చౌక్ నుంచి బ్యాండ్ మేళా నడుమ ర్యాలీ తీశారు. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ కార్మికుల పనిముట్లకు ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకుల ద్వారా సబ్సిడీ అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 28వ తేదీన ఢిల్లీలో నిర్వహించే ధర్నాను కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాదే లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు జాడి పోశం, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలి

ఎదులాపురం, మార్చి 11 : ఇచ్చోడలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న లాలిత్య అనే బాలిక అనుమానస్పద మృతిపై విచారణ జరిపించాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం (టీఏవీఎస్ ) రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 14 నెలల కాలంలో పదుల సంఖ్యలో విద్యార్థులు చనిపోతున్న ప్రభుత్వం నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో విద్యారంగాన్ని సమీక్ష చేసి సమస్యలు పరిష్కారం చేయడం లేదు. తక్షణమే ఆశ్రమ పాఠశాలలో చనిపోయిన లాలిత్య మృతిపై సమగ్రమైన విచారణ జరిపించాలన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన

బోథ్, మార్చి 11: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని నక్కలవాడ గ్రామ పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీవో రమేశ్ పరిశీలించారు. ఈ ఆయన మాట్లాడుతూ కొలతలకు అనుగుణంగా కందకాల పనులు చేపట్టాలన్నారు. పనులు జరిగిన వెంటనే క్షేత్రస్థాయి సిబ్బంది కొలతలు తీసుకొని నమోదు చేయాలని సూచించారు. జాబ్ కార్డులు ఉన్న కూలీలందరికీ పనులు కల్పించాలని సూచించారు. ఆయన వెంట టీఏలు, ఎఫ్ఏలు, కూలీలు ఉన్నారు.

## వార్డెన్, ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

ఉట్నూర్, మార్చి 11 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కుమ్రం భీం చౌక్ ఎదుట మంగళవారం ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిడాం జంగుదేవ్‌పటేల్ మాట్లాడుతూ ఇచ్చోడ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదవుతున్న విద్యార్థిని లాలిత్య మృతిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి రూ.20లక్షల ఆర్థిక సాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు జాడి వెంకటేశ్, త్రిమూర్తి, తుకారాం, మోతీరాం, కిషన్, దేవీదాస్, అరవింద్, శ్రీను, ప్రదీప్ పాల్గొన్నారు.

# సైబర్ కుట్ర భగ్నం

- బిహార్ ముఠాను పట్టుకున్న పోలీసులు
- 2125 ఫోన్లు, 107 సిమ్ కార్డులు, 600 బ్యాటరీలు స్వాధీనం
- ఐదుగురు బిహారీలు అరెస్టు.. ఐదు ద్విచక్రవాహనాలు రాణాకు తరలింపు
- వివరాలను వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఆదిలాబాద్ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, మార్చి 11 : వీధుల్లో తిరుగుతూ పాత సెల్‌ఫోన్లు, బ్యాటరీలు, సిమ్‌కార్డులకు ప్లాస్టిక్ డబ్బాలు ఇస్తామంటూ సైబర్ మోసాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లండించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన తబరక్(ముఠ నాయకుడు-ఏ1), మహ్మద్ మెరాజుల్(ఏ2), మహబూబ్ ఆలం(ఏ3), మహమ్మద్ జమాల్(ఏ4), ఎండీ ఉజిర్(ఏ5), అబ్దుల్లా(ఏ6) యువకులు గ్యాంగ్ ఏర్పడ్డారు. బిహార్ నుంచి ఐదు ద్విచక్రవాహనాలలో తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించారు. ఇక్కడ పాత మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, బ్యాటరీలు తీసుకుని ప్లాస్టిక్ డబ్బాలను ఇస్తామంటూ గ్రామాలు, పట్టణాల్లోని వీధుల్లో ద్విచక్రవాహనాలపై తిరుగుతున్నారు. ఇలా సేకరిచిన సిమ్ కార్డులు, ఫోన్ల ద్వారా వివిధ రాష్ట్రాల్లోని ప్రజలకు బ్యాంక్ అధికారులం అంటూ ఫోన్లు చేస్తున్నారు. ఇలా సైబర్ నేరాలకు పాల్పడుతున్న వీరి కుట్రను భగ్నం చేశారు. వీరి వద్ద నుంచి దాదాపు 2125 పాత మొబైల్ ఫోన్‌లు, 107 సిమ్ కార్డులు, ప్లాస్టిక్ డబ్బాలు, ఐదు ద్విచక్ర వాహనాలు, వీరు వినియోగించే ఐదు మొబైల్ ఫోన్‌లు, 600 మొబైల్ బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు రెండో ఆదిలాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. ప్రధానంగా కర్ణాటక రాష్ట్రం నుంచి దాదాపు 10 వేల నుంచి 12 వేల వరకు మొబైల్ ఫోన్లను సేకరించి వాటి ద్వారా వివిధ సైబర్ నేరాలకు పాల్పడ్డారన్నారు. పక్కా సమాచారం మేరకు ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలో వారిని అరెస్టు చేశామన్నారు. ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా.. తబరక్ పరారీలో ఉన్నాడని తెలిపారు. ఈ కేసు విషయంలో బిహార్ రాష్ట్రంలోని కతిహార్ జిల్లా ఎస్పీతో మాట్లాడతామన్నారు. ఈ కుట్రను చాకచక్యంగా కనుక్కుని అరెస్టు చేసిన సైబర్‌క్రైం డీఎస్పీ హసిబుల్లా, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, టూ టౌన్ సీఐ సిహెచ్ కరుణాకార్‌రావు, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్‌లను ఎస్పీ అభినందించారు.

# ప్లంబర్లను ప్రభుత్వాలు గుర్తించాలి



బైక్ ర్యాలీ తీస్తున్న ప్లంబర్లు

ఎదులాపురం, మార్చి 11 : భవన నిర్మాణ రంగంలో కీలకంగా ఉన్న ప్లంబర్లను ప్రభుత్వాలు గుర్తించాలని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ అన్నారు. అంతర్జాతీయ ప్లంబర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆదిలాబాద్‌లో ఐఎఫ్టీయూ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ తీశారు. కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్‌చౌక్ మీదుగా పట్టణంలోని ప్రధాన చౌక్‌ల గుండా ర్యాలీ సాగింది. ప్లంబర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఐఎఫ్ఎయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు నుంచి రావాల్సిన నిధులు పెండింగ్‌లో ఉంటున్నాయని, సంక్షేమ బోర్డును ప్రైవేట్ అప్పగించే యత్నం ప్రభుత్వం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్లంబర్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్, దేవీదాస్, ఎండీ అఖిల్, గఫూర్, శేషారావ్, కైసార్, రాజ్, జనార్దన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# రెండు బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉన్నతంగా రాణిస్తున్నారు

ఎదులాపురం, మార్చి 11 : ఉద్యోగిణిగా, గృహిణిగా మహిళలు రెండు బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉన్నతంగా రాణిస్తున్నారని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ముందుగా విద్యార్థులు మహిళల గొప్పతనం గురించి వివరిస్తూ చేసిన నాటిక, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ శాఖల్లో రాణిస్తున్న మహిళలను కలెక్టర్ సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ఇంటి బాధ్యతతోపాటు ఉద్యోగ కర్తవ్యాలను మహిళలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. బాల్య వివాహాలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలతోపాటు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీలు అందిస్తున్న సేవలు అమోగం అని కొనియాడారు. ఉద్యోగంలో ఉంటూ వారు చేసిన సేవలతో అనేక మందికి మంచి చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు కూడా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీఈవో ప్రణిత, లోకల్ కంప్లెంట్ కమిటీ చైర్‌పర్సన్ భవన సింగ్, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమ అధికారి కె.మిల్కా, మహిళ కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, జిల్లా టీబీ అధికారి డాక్టర్ సుమలత, డీఎంసీ యశోద, జిల్లా సమాఖ్య సభ్యురాలు వనజ, మెప్మా పట్టణ అధ్యక్షుడు ఉమాదేవి, నైనత, శ్రావ్య పాల్గొన్నారు.



డీఈవోను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు

### ప్రొసీడింగ్ కాపీ అందజేత

ఎదులాపురం, మార్చి 11: ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారునికి ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. 25 శాతం రాయితీతో ప్రభుత్వం ఇచ్చిన ఈ సదవకాశాన్ని వినియోగించుకోవడం జరిగిందన్నారు. మిగతా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఈ నెల 31వ తేదీలోగా రుసుము చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ట్రాఫిక్ సమస్యపై సమావేశం

ఎదులాపురం, మార్చి 11 : ఆదిలాబాద్‌లోని ట్రాఫిక్ సమస్య దృష్ట్యా చిరు వ్యాపారులతో మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్యను నిర్మూలించడానికి సంబంధించిన విషయాలను చర్చించారు. అందులో భాగంగా ప్రత్యామ్నాయ మార్గాలను కూడా వివరించారు. సమావేశంలో ఆర్డీవో వినోద్ కుమార్, డీఎస్పీ జీవన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు, అధికారులు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

# కందుల వద్దే జాగారం



కందుల వద్ద కావలి కాస్తున్న రైతులు

బేల, మార్చి 11 : ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని సబ్ మార్కెట్ యార్డ్‌కు రెండు రోజుల క్రితం రైతులు కందులను తీసుకొచ్చారు. ఈ కందులను కాంటా వేసిన అధికారులు కొన్నింటిని గన్నీ సంచుల్లో నింపారు. మిగిలిన కందులను గన్నీ సంచులు లేకపోవడంతో ఆపేశారు. వీటిని కాపాడుకోవడం కోసం రెండు రోజుల నుంచి రైతులు రాత్రి, పగలు కందుల కాపాలా ఉంటున్నారు. గన్నీ బ్యాగులు త్వరగా తెప్పించాలని కోరినా అధికారుల్లో చలనంలేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం కాంటా వేసి గన్నీ బ్యాగుల్లో నింపిన కందులను అయినా గోదాముకు తరలించాలని కోరుతున్నారు.

## పెట్రోలింగ్, గస్తీ నిర్వహిస్తూ నేర నియంత్రణ చేపట్టాలి

ఎదులాపురం, మార్చి 11: పెట్రోలింగ్, గస్తీ నిర్వహిస్తూ నేర నియంత్రణ చేపట్టాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లాలోని మావల, రూరల్ పోలీస్ స్టేషన్లను ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీ చేశారు. మొదటగా జిల్లా ఎస్పీకి పూల మొక్క అందజేసి స్వాగతం పలికిన రూరల్ సీఐ ఫణిధర్, మావల రెండవ ఎస్ఐ గౌతమ్, పోలీస్ స్టేషన్ పరిసరాలలో ఒక మొక్క నాటి, పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా రెండు పోలీస్ స్టేషన్‌ల పరిసరాలను కేటాయించిన స్థలాన్ని సరిహద్దుగా ఉన్న వివరాలను తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలని తెలిపారు. అదేవిధంగా రూరల్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ గ్రామీణ సీఐ కె.ఫణిదర్, ఎస్ఐలు ముజాహిద్, గౌతమ్, ఫీర్‌సింగ్ నాయక్, మావల, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


## ఎమ్మెల్యేను కలిసిన ఒడ్డెర సంఘం నాయకులు



ఒడ్డెర సంఘ నాయకులతో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, మార్చి 11 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలోని ఒడ్డెర సంఘం నాయకులు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం వారి సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. తప్పకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బొంతుకుల శ్రీను, కుంచపు గోవింద్, గోగుల సీతారాం, బోదాసు నరేశ్, శివరాత్రి శేఖర్, మల్లేశ్, బోదాసు రవి, రాములు, హనుమంతు, సాయిలు, నర్సయ్య, పోశెట్టి, నర్సింహులు, లింగయ్య, బీఆర్ఎస్ నాయకులు సాబ్లే సంతోష్‌సింగ్, రాథోడ్ రాజశేఖర్ ఉన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలి



కడెం: రైతులతో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

కడెం, మార్చి 11 : యాసంగిలో రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామంలో ఇటీవల ఎండిన వరి పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఇక్కడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సదర్మాట్ చివరి ఆయకట్టు వరకు నీరు అందడం లేదని, వారబంధి పద్ధతి వల్ల పంటలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. కాలువలు, తూములు చెడిపోయి నీరు వృథాగా పోతుందని విన్నవించారు. అయితే రైతుల నుంచి పలు వినతులు స్వీకరించిన అనంతరం నీటి పారుదల, వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. సదర్మాట్ రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని, క్రమం తప్పకుండా కాలువ తెరిచి ఉంచాలని ఆదేశించారు. అలాగే కడెం ప్రాజెక్టుకు నీటి ఫీడింగ్‌ను ధర్మాజిపేట, నచ్చన్‌ఎల్లాపూర్ నుంచి కాకుండా కొత్తమద్దిపడగ, పెద్దూర్‌తండా మీదుగా ఫీడింగ్ చేయాలని సూచించారు. పంట చివరి వరకు రైతులకు ఇబ్బందులు లేకుండా నీటి విడుదల కొనసాగాలని ఆదేశించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈఈ విఠల్, డీఏవో అంజిప్రసాద్, తహసీల్దార్ ప్రభాకర్, ఏడీఏ సుజాత, ఏవో దినేశ్, ఏఈఈ విశాల్, రైతులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 11 : ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ సమావేశమందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 31 వ తేదిలోపు పూర్తి ఫీజు చెల్లిస్తేనే 25 శాతం వర్తిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 46 వేలు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇప్పటికే అధికారులకు అవగాహన, శిక్షణ కల్పించడం జరిగిందన్నారు. సమావేశంలో డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్‌గౌడ్, రాజేశ్‌కుమార్, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

## చేనులో విగతజీవుగా..

### విద్యుత్ షాక్‌తో వృద్ధ రైతు మృత్యువాత



భోజన్న(ఫైల్)

భైంసా, మార్చి 11 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని కోతుల్ గాం గ్రామానికి చెందిన భోజన్న(62) మంగళవారం విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. భోజన్న తనకున్న రెండెకరాల్లో మక్క వేశాడు. మంగళవారం ఉదయం ఆరు గంటలకు మక్కకు నీరు పెట్టడానికి చేను వద్దకు వెళ్లాడు. ఎప్పటిలాగే వ్యవసాయ మోటరు ఆన్ చేసి పక్క చేనులో ఉన్న పైపును సరి చేయడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఆ చేను వాళ్లు అడవి పందుల కోసం అమర్చిన విద్యుత్ వైరు తగిలి అక్కడి కక్కడే మృత్యువాత పడ్డాడు. ఈయనకు ముగ్గురు కొడుకులు కాగా.. నడిపి కొడుకు శ్రీనివాస్ తండ్రి రాకపోవడతో చేను వద్దకు వెళ్లాడు. తండ్రిని చేనులోనే విగత జీవిగా మారడం చూసి కన్నీరుమున్నీరు అయ్యాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మాణిక్ తెలిపారు.

## పీహెచ్‌సీ తనిఖీ

గుడిహత్నూర్, మార్చి 11 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్ తనిఖీ చేశారు. ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడారు. సమయపాలన పాటిస్తూ రోగులకు వైద్యం అందించాలని సూచించారు. మందుల స్టాకు గదిని పరిశీలించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రికార్డులను పరిశీంచారు. ఆయన వెంట జిల్లా ప్రోగాం అధికారి డాక్టర్ శ్రీధర్, స్థానిక వైద్యాధికారి శ్యాంసుందర్ ఉన్నారు.

## ప్రజావాణి బహిరంగ ప్రజావేదిక

తాంసి(భీంపూర్), మార్చి 11: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లోని రైతు వేదికలో మండల ప్రత్యేకాధికారి కిషన్ అధ్యక్షతన ప్రజావాణి ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. మొత్తం 54 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గృహజ్యోతికి సంబంధించి అత్యధికంగా దరఖాస్తులు రాగా అధికారుల సమక్షంలో సమస్యలు పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాల కృష్ణారెడ్డి, తహసీల్దార్ నలందప్రియా, ఏఈ చంద్రశేఖర్, ఏవో శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ ఫలితాలు విడుదల చేయాలి

ఉట్నూర్, మార్చి 11 : ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చిన తర్వాతే అన్ని వివిధ ఉద్యోగ ఫలితాలు విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బాలాజీకాంబ్లే మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని తహసీల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఎస్సీలకు న్యాయం జరగాలంటే ఎస్సీ వర్గీకరణ చట్టం తర్వాతే ఫలితాలు సమానంగా అందుతాయన్నారు. రాబోవు శాసనసభ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల కాంతారావుమాదిగ, మండల ఇన్‌చార్జి దాసరి రాంప్రసాద్, నాయకులు అశోక్, బాలాజీ, విష్ణు, సురేశ్, మాధవ్ పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ తోటలకు జాగ్రత్తలు తీసుకోవాలి

కడెం, మార్చి 11 : వేసవిలో ఆయిల్‌పామ్ తోటలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి స్పందన రైతులకు సూచించారు. మంగళవారం నిర్మల్ జిల్లా కడెం మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్, మే మాసాల్లో ఉష్ణోగ్రతలు దృష్టిలో పెట్టుకొని రైతులు పంటలను కాపాడుకోవాలని, ప్రతిరోజూ తప్పనిసరిగా నీటిని అందించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం నచ్చన్ఎల్లాపూర్‌లోని ఉద్యానవన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట రైతులు ఉన్నారు.

## మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

నర్సాపూర్ (జీ), మార్చి, 11 : ప్రతి మహిళ సంఘాల ద్వారా ఆర్థిక పురోగతి సాధించాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల మహిళా సమైక్య భవనంలో తొమ్మిది మండలాలకు సంబంధించిన ఏపీఎం, సీసీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండి స్వీయ రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం ప్రసాద్, గంగారెడ్డి , భోజన్న ఏపీఎం, సీసీలు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

జైనథ్, మార్చి 11 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని గిమ్మా గ్రామ శివారులో పేకాటాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.43,290 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వీ పురుషోత్తం తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట, మట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నట్లయితే జైనథ్ సీఐ 8712659916, జైనథ్ ఎస్ఐ 8712659929 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ అర్బన్, మార్చి 11 : ప్రజల మన్ననలు పొందేలా పోలీసులు విధులు నిర్వహించాలని నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం నిర్మల్ సబ్ డివిజనల్, గ్రామీణ పోలీస్ స్టేషన్‌ను ఆమె తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. ఎస్పీ మొదట పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి కేసులు నమోదవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. విచారణలో ఉన్న కేసులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో అధికారులు సిబ్బంది పోటీపడి విధులు నిర్వహించాలని సూచించారు. అంకితభావంతో పని చేసిన వారికి రివార్డులు, అవార్డులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. సంఘ విద్రోహ శక్తులపై గట్టి నిఘాను ఉంచాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి క్రైమ్‌రేట్ తగ్గించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఆమె వెంట ఏఎస్పీ రాజేశ్‌మీనా, రూరల్ సీఐ కృష్ణ, ఎస్ఐ లింబాద్రి ఉన్నారు.

## దగ్ధమవుతున్న అడవులు



దగ్ధమవుతున్న అటవీ ప్రాంతం

ఖానాపూర్ రూరల్, మార్చి 11:ఖానాపూర్ మండలం సోమర్‌పేట్ రోడ్డు రంగపేట్ అటవీ శివారులో మంగళవారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. అడవిలో ఉన్న వృక్ష సంపద బుడిదపాలైంది. అధికారులు గ్రామంలో ఉన్న పట్టించుకోలేని పరిస్థితులు ఉన్నాయి. పలు చోట్ల ప్లాంటేషన్ నష్టం జరుతుగుంది. అటవీ జంతువులకు సైతం అగ్నితో ప్రమాదం పొంచి ఉంది. అటవీలో రాలిన ఆకులను శుభ్రపరిచే సిబ్బంది ఉన్న అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇలాంటి ఘటనలు చాలా జరుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## సారంగాపూర్‌లో దొంగతనం

కడెం, మార్చి 11 : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని సారంగపూర్ గ్రామంలో సోమవారం రాత్రి దొంగతనం జరిగినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ శంకర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన వంగా సుధాకర్ బతుకుదెరువు నిమిత్తం గల్ఫ్ దేశంలో ఉంటున్నాడు. ఆయన భార్య వంగా గౌతమి తన సొదరితో కలిసి ఉంటుంది. సోమవారం రాత్రి తిని పడుకొని ఉదయం లేచేసరికి తాళాలు పగిలిపోయి బీరువాలో ఉన్న 2 తులాల బంగారం, 5 తులాల వెండి అపహరించుకుపోయారు. ఈ మేరకు సంఘటన స్థలానికి పోలీసులు, క్లూస్‌టీం చేరుకొని విచారణ చేపట్టారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వాగులో మృతి చెందిన స్థితిలో మగ శిశువు

గుడిహత్నూర్, మార్చి 11: మరో మూడు నెలలలో లోకాన్ని చూడాల్సిన పసికందు ఓ తల్లి చేసిన నిర్వాకాన్ని పిండం రూపంలో ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని గురుజ గ్రామంలోని పరిసర ప్రాంతంలోని వాగులో మంగళవారం శిశువు మృతదేహం లభ్యం కనిపించింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు బహిర్భూమికి వాగు వైపు వెళ్లగా ఆ వాగులోని ఇసుకలో మగపిండం ఉన్న శిశు మృతదేహం కనిపించింది. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ అవమానీయ సంఘటనపై విచారణ చేపట్టి కారకులైన వారిని త్వరలో పట్టుకొని వెల్లడిస్తామని ఇచ్చోడ సీఐ భీమేశ్, స్థానిక ఎస్ఐ మహేందర్ తెలిపారు

## గుడుంబా విక్రయించిన వారిపై కఠిన చర్యలు

పెంబి, మార్చి 11: అక్రమంగా గుడుంబా విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గంగారెడ్డి అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా పెంబిలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ముందస్తు సమాచారం మేరకు రాజ్‌మహ్మద్ నివాసంలో తనిఖీలు చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 8 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. రాజ్ మహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్ హుస్సెన్ తదితరులు పాల్గొన్నారు.

## సామంత్ కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఉట్నూర్, మార్చి 11 : వివిధ కళల్లో రాణిస్తున్న సామంత్ కుమార్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా సూచించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం గోదారిగూడ గ్రామానికి చెందిన సామంత్‌కుమార్ వివిధ కళలు, డాన్సులలో రాణిస్తూ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో అవార్డు సాధించారు. మంగళవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో వరల్డ్‌బుక్ రికార్డు సర్టిఫికెట్, మెడల్, షీల్డ్‌ను అందజేసి అభినందించారు. ఇక్కడ ఏపీవో మెస్రం మనోహర్ ఉన్నారు.

## సమష్టి కృషితోనే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం

భైంసా, మార్చి, 11: సమష్టి కృషితోనే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగిందని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కర్త విలాస్ గాదేవార్ అన్నారు. మంగళవారం భైంసాలోని తన నివాసంలో తెలంగాణ ఉద్యమ కారుల త్యాగాలను పుస్తక రూపంలో తీసుకురావడంతో ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యమ కారుల చరిత్రను పుస్తక రూపంలో తీసుకరావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సోమ జనార్దన్ రెడ్డి, పుండ్లిక్ రావు, డాక్టర్ రామకృష్ణ గౌడ్, డాక్టర్ ముత్యం రెడ్డి పాల్గొన్నారు.

## అదృశ్యమైన బాలుడు అప్పగింత

కుంటాల, మార్చి, 11 : కుంటాల మండలంలోని లింబా (కే)లో ప్రసాద్ (10) అనే బాలుడు తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపంతో ఆటలాడుకుంటానని బయటకు వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెతకడం ప్రారంభించారు. అదే రోజున మధ్యాహ్నం భైంసా మండలం సుంక్లి గ్రామంలో ఆ బాలుడు కనిపించాడని గ్రామస్తులు పోలీసులకు తెలియజేయడంతో ఎస్ఐ భాస్కరా చారి, ఏఎస్ఐ దేవన్న అక్కడికి చేరుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. కన్న కొడుకు దొరకడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

VEHICLE FOR SALE
★Vehicle for Auction: On where conditions Maruthi DZIRE VXI BS VI, Veh No: TS19F1367, Contact: INDUSIND Bank Ltd. MNCL. Cell: 87901 48866.
NTK-0000

VEHICLE FOR SALE
★Vehicle for Auction: On where conditions Maruthi BALENO ZETA BS VI, Veh No: TS19H9259, Contact: INDUSIND Bank Ltd. MNCL. Cell: 99593 40936.
NTK-0000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677